సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 20 । ఏప్రిల్ । 2025



'ఉష'స్సులు

దివ్యాంగుల జీవితాల్లో ఆమె ఉషస్సులు నింపుతున్నారు. కృత్రిమ అవయవాలు అందిస్తున్నారు.

- 4లో



గంజాయి ఒప్పందాలు..

క్రికెట్ మైదానంలో గంజాయి ఒప్పందాలు జరుగుతున్నాయి. కాశీబుగ్గలో ఈ దారుణాలు జరుగుతున్నాయి.

- 4లో

21న కంచి విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు

శ్రీకాకుళం అర్బన్: కంచి విశ్వవిద్యాలయంలో ప్రవేశాల కోసం ఈ నెల 21న విశాఖలోని శంకర మఠంలో ప్రవేశ ప్రక్రియను నిర్వహించనున్నట్టు శ్రీకంచి కామకోటి శంకర మఠం అధ్యక్షుడు డాక్టర్ టి.రవిరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 22న శ్రీకాకుళంలోని గాయత్రి స్కూల్, గీతాంజలి స్కూల్ ఆవరణలోనూ ప్రక్రియ నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

21 నుంచి స్లాట్‌తోనే రిజిస్ట్రేషన్



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): క్రయ, విక్రయదారులు రిజిస్ట్రేషన్లు చేసుకునేవారు ఈ నెల 21వ తేదీ నుంచి స్లాట్‌ను బుక్ చేసుకుని మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లేదంటే రిజిస్ట్రేషన్లు జరగవని జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ నాగలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్‌ల ద్వారా జరగనున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు రాబోయే సోమవారం ఏప్రిల్ 21 నుంచి జిల్లాలో అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఇదే విధానంలో రిజిస్ట్రేషన్లు ఉంటాయని తెలిపారు. ఈ స్లాట్‌లు ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు బుక్ చేసుకునే వీలుంటుందని తెలిపారు. ఈ విషయంలో ప్రజలకు ఎలాంటి సందేహాలున్నా తమ పరిధిలో ఉండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంప్రదించి పూర్తి వివరాలను తెలుసుకోవచ్చన్నారు. అదేవిధంగా ఎనీవేర్ పద్ధతిలో రిజిస్ట్రేషన్లకు ఒక రోజు ముందుగా ఈ స్లాట్ బుకింగ్ విధానంలో స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చునని తెలిపారు.

విద్యారంగాన్ని టీచర్లే కాపాడాలి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

టెక్కలి రూరల్: పాలకుల విధానాల ఫలితంగా ప్రభుత్వ బడులకు ముప్పు ఏర్పడరాదని, ప్రస్తుత ప్రభుత్వ విద్యారంగాన్ని ఉపాధ్యాయులే కాపాడుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబురావు అన్నారు. ఆయన కోటబొమ్మాళిలో శనివారం జరిగిన యూటీఎఫ్ ప్రాంతీయ సమావేశంలో పాల్గొని బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరుతూ గోడ పత్రికను ఆవిష్కరించారు. ప్రభుత్వ విద్యారంగం ఉంటేనే పేద ప్రజలకు విద్య అందుతుందని ఆయన అన్నారు. ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలని కోరారు.



ఆలయ భూముల్లో అక్రమార్కులు



ఆలయ భూమిలోకి వచ్చేసిన ప్రహరీ పిల్లర్లు (రెడ్ మార్కు)



- ఆదిత్యుని భూములను వరుసగా ఆక్రమిస్తున్న వైనం
- మొన్న ఒకరు రోడ్డేశారు.. నిన్న మరొకరు పిల్లర్లు వేసేశారు
- తెరవెనుక పెద్దల జోక్యంతో ఏమీ చేయలేకపోతున్న అధికారులు

అరసవల్లి:

కూటమి ప్రభుత్వం వచ్చాక వరుసగా ఆలయ భూముల్లో అక్రమార్కులు చొరబడుతున్నారు. ప్రత్యక్ష దైవం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయ భూములను కొందరు ఆక్రమణదారులు వ్యాపారాలకు అనువుగా వాడుకుంటుంటే.. మరికొందరు తమ ఇంటి వాస్తులకు వీలుగా ఆలయ భూములను కలిపేసుకుని ప్రహరీలు నిర్మించుకుపోతున్నారు. ఇటీవల వాడాడ కూడలి వద్ద ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి ఏకంగా రహదారి వేసేయగా.. తాజాగా గ్రామదేవత అసిరితల్లి అమ్మవారి ఆలయం ఎదురుగా ఉన్న ఆదిత్యుని భూమిని ఆక్రమించి భవన నిర్మాణానికి వీలుగా కాంక్రీట్ పిల్లర్లు వేసేశారు. ఇంత దర్జాగా ఆలయ భూములను ఆక్రమిస్తున్నప్పటికీ ఆలయ అధికారులు అడ్డుకోలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం పెద్దల జోక్యమనే చర్చ సాగుతోంది. వివరాల్లోకి వెళితే.

మొన్న రోడ్డు.. నిన్న పిల్లర్లు

ఆదిత్యునికి చెందిన ఆలయ భూముల్లో కొంత భాగాలను తమ భూములకు కలిపేసుకుంటూ ఆక్రమించేందుకు కొందరు బరి తెగించారు. వాడాడ జంక్షన్ వద్ద సర్వే నంబర్ 130లో సుమారు మూడున్నర సెంట్ల భూమిని ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి రహదారిని నిర్మించేశాడు. దీనిపై 'సాక్షి'లో వరుస కథనాలు రావడంతో అధికారులు ఉలిక్కిపడి పోలీసు కేసు కూడా నమోదు చేయించారు. అయినప్పటికీ ఆ రహదారి తీరు మారలేదు. పెద్దల జోక్యంతో ఇంకా ఆ అక్రమ రహదారి అలానే ఉంది. ఇదిలావుంటే తాజాగా ఆదిత్యుని ఆలయానికి కూతవేటు దూరంలో ఉన్న సర్వే నంబర్ 87లో ఉన్న స్థలంలో ఏకంగా భవన నిర్మాణాన్ని చేపడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఓ ఉన్నతాధికారికి చెందిన భూమిలో కాంట్రాక్టర్ ప్రమేయంతో ఈ ఆక్రమణ జరిగిందనే నిర్ధారణకు వచ్చారు. వాస్తవానికి ఆ జిరాయితీ భూమికి తూర్పు, పడమర, ఉత్తర దిక్కుల్లో ఆలయ భూముల సరిహద్దులున్నాయి. అయితే భారీ భవన నిర్మాణానికి సిద్ధపడిన ఆ భవన యజమాని వాస్తుకు అనుగుణంగా నిర్మాణాలుండాలని భావించగా సంబంధిత కాంట్రాక్టర్ ఏకంగా ఆదిత్యుని ఆలయానికి చెందిన భూమిలో ఏకంగా తొమ్మిది పిల్లర్లను వేసేసి ప్రహరీ నిర్మాణం చేపట్టేశాడు. సరిహద్దు భూమి యజమానులెవ్వరికీ కనీస సమాచారం ఇవ్వకుండానే భూమిలో నిర్మాణ పనులను మొదలుపెట్టడం వివాదాస్పదంగా మారింది. అయితే స్థానికులిచ్చిన సమాచారం మేరకు ఆలయ అధికార సిబ్బంది టౌన్ సర్వేయర్‌తో సహా వెళ్లి ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. కచ్చితంగా ఆలయ భూమిని కలిపేసుకున్నారని నిర్ధారణ చేశారు. దీనిపై ప్రశ్నిస్తే వాస్తుకు అనుగుణంగా నిర్మాణానికి వీలుగా కలుపుకున్న ఆలయ భూమి విస్తీర్ణాన్ని తగ్గట్టుగా తూర్పు భాగంగా బదులు ప్రత్యామ్నాయంగా ఆలయానికి భూమిని ఇచ్చేస్తామని భవన నిర్మాణదారులు చెబుతున్నారు. ఆలయానికి చెందిన ఓ ఉద్యోగి చేతివాటంతోనే ఆలయ భూముల ఆక్రమణలు సాధ్యమవుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



భవన నిర్మాణం వద్ద సర్వే చేస్తున్న సర్వేయర్ల బృందం

ఆక్రమణను గుర్తించాం



అసిరితల్లి అమ్మవారి ఆలయం ఎదురుగా ఆదిత్యుని ఆలయానికి చెందిన భూమి ఆక్రమణకు గురైందని తెలిసి పరిశీలించాం. కచ్చితంగా ఆలయ భూమిలో సుమారు రెండు సెంట్ల వరకు భూమి ప్రహరీ నిర్మాణంలో కలిపేసినట్లుగా సర్వేయర్ల బృందం తేల్చింది. ఈ ఆక్రమణ పిల్లర్లను వెంటనే తొలగించాలని ఆదేశించాం. లేదంటే తగు చర్యలు చేపడతాం. ఇక ల్యాండ్ టు ల్యాండ్ ప్రాసెస్ అనేది చాలా పెద్ద ప్రక్రియ. అలా ఆలయ భూమి కలిపేసుకుని మరోచోట భూమి ఇస్తామంటే వెంటనే జరిగే పని కాదు. – వై.భద్రాజీ, ఆలయ ఈఓ

జేఈఈ మెయిన్స్‌లో సిక్కోలు జోరు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జేఈఈ మెయిన్స్ ఆల్‌ఇండియా ర్యాంక్స్‌లో సిక్కోలు విద్యార్థులు సత్తా చాటారు. ఉత్తమ ర్యాంకులు సాధించి జిల్లాకు మంచి పేరుప్రఖ్యాతలు తీసుకొచ్చారు.



బుడుమూరు విక్రమ్ రాజా

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలం అల్లినగరం గ్రామానికి చెందిన బుడుమూరు విక్రమ్‌రాజా ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 64వ ర్యాంకు సాధించాడు. ఆల్ ఇండియా ఓబీసీ కేటగిరిలో ఆరో ర్యాంకు సాధించాడు. తండ్రి సోమరాజు టీచర్, తల్లి కళ్యాణి గృహిణి.



రోహిత్ దత్తా

శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరం కల్కినగర్ కాలనీలో నివాసం ఉంటున్న బంగారు రోహిత్ దత్తా ఆల్ ఆండియా ఓపెన్ కేటగిరీలో 255వ ర్యాంకు సాధించాడు. ఇతని తండ్రి సాయిరాం ఉపాధ్యాయుడు కాగా, తల్లి లక్ష్మిప్రసన్న ప్రణాళిక శాఖలో జాయింట్ డైరెక్టర్‌గాను, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారిగా పనిచేస్తున్నారు.



నూకల రోహిత్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గాంధీనగర్‌కు చెందిన నూతక రోహిత్‌కు ఓబీసీ కేటగిరీలో 965వ ర్యాంకు వచ్చింది. తండ్రి హేమసుందర్, తల్లి విజయలు ఫొటో స్టూడియో నడుపుతున్నారు.



బోయిన లక్ష్మీనివాస్

- శ్రీకాకుళం కత్తెర వీధిలో నివాసం ఉంటున్న బోయిన లక్ష్మీనివాస్‌కు 206వ ర్యాంకు వచ్చింది. విద్యార్థి తండ్రి రవిశంకరరావు బియ్యం వ్యాపారి.
- శ్రీకాకుళంలోని ఏఎస్ఎన్ కాలనీలో నివాసం ఉంటున్న కూన రఘువీర్‌కు 308వ ర్యాంకు వచ్చింది. విద్యార్థి తండ్రి ప్రముఖ కంటి వైద్య నిపుణుడు కేఎల్ నాయుడు.



అగస్త్య

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళంలోని డీసీసీబీ కాలనీకి చెందిన అగస్త్యకు ఓపెన్ కేటగిరీలో 2742వ ర్యాంకు వచ్చింది. అతడి తల్లిదండ్రులు గోపాలకృష్ణ, శ్రీలక్ష్మి ఉపాధ్యాయులు.



మోక్షలలిత

సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన సానా మురళీకృష్ణ, సానా శ్రావణిల కుమార్తె మోక్షలలిత ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 1018వ ర్యాంకు సాధించింది. ఆలిండియా లెవల్‌లో 8411వ ర్యాంకు సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



పుష్ప ప్రశాంత్ కార్తీక్



చింతాడ అభిషేక్

పాతపట్నం: పాతపట్నం మండలం సరాలి గ్రామానికి చెందిన పుష్ప ప్రశాంత్ కార్తీక్ ఆల్‌ఇండియా ఓపెన్ క్యాటగిరీలో 818వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 130వ ర్యాంకు సాధించాడు. తండ్రి ఈశ్వరరావు రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. తల్లి లత ప్రభుత్వ ఉపాధ్యాయరాలిగా పనిచేస్తున్నారు. అలాగే పాతపట్నం మేజర్ పంచాయతీ యశోదనగర్‌కు చెందిన చింతాడ అభిషేక్ ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 9,560 ర్యాంకు, ఓబీసీలో 2,117 సాధించాడు. తండ్రి చింతాడ కృష్ణారావు ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. తల్లి చింతాడ రోషిణి గృహిణి.



ధర్మాన జ్ఞాన రుత్విక్ సాయి

నరసన్నపేట: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నరసన్నపేట మండలం దేవాదికి చెందిన ధర్మాన జ్ఞాన రుత్విక్‌సాయి సత్తా చాటాడు. 99.985 శాతం మార్కులు పొంది జాతీయ స్థాయిలో 294, ఓబీసీ కేటగిరీలో 38వ ర్యాంకు పొందాడు. ఫిజిక్స్, కెమిస్ట్రీల్లో వందకు వంద మార్కులు పొందగా మ్యాథమెటిక్స్‌లో 99.91 మార్కులు కైవసం చేసుకున్నాడు. రుత్విక్ సాయి తల్లిదండ్రులు శంకర్‌నారాయణ, లతలు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మే నెల నాల్గో తేదీ నుంచి 12 వరకూ సాదీ అరేబియాలో జరగనున్న ఏషియన్ ఫిజిక్స్ ఒలంపియాడ్ 2025కు రుత్విక్‌సాయి ఎంపిక అయిన విషయం విదితమే.



చైతన్య

- స్థానిక మారుతీ నగర్–4కు చెందిన బొంతల వెంకట చైతన్య ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 4993వ ర్యాంకు, ఓబీసీలో 1010వ ర్యాంకును పొందాడు. 99.68 మార్కులు వచ్చాయి. తల్లిదండ్రులు బీవీ రమణ, ఎల్లమ్మలు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.



యశ్వంత్ నాయుడు

జి.సిగడాం: వాండ్రంగి గ్రామానికి చెందిన బూరాడ యశ్వంత్ నాయుడు జేఈఈ మెయిన్స్‌లో ఓబీసీ కేటగిరీలో 2202వ ర్యాంకు సాధించాడు. 99.36 మార్కులు తెచ్చుకున్నాడు. విద్యార్థి తండ్రి బూరాడ వెంకటరమణ, తల్లి కమలకుమారి.



ఉద్ధవ్

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలేం పంచాయతీ పెయిలవానిపేట గ్రామానికి చెందిన పెయిల ఉద్ధవ్‌కు 9498వ ర్యాంకు రాగా, ఎస్సీ కేటగిరిలో జాతీయ స్థాయిలో 222వ ర్యాంకు వచ్చింది.

అధికార పార్టీ నాయకుల భూ దాహం

- ప్రభుత్వ భూములు ఆక్రమిస్తున్నారు
- ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గంలో టీడీపీ నాయకుల భూ దాహం పెరిగిపోతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ఆరోపించారు. పాతపట్నం మండలం ప్రహరాజపాలేం రెవెన్యూ పరిధి అటవీ శాఖతో పాటు సమీపంలో ఉన్న కొత్త చెరువు భూముల ఆక్రమణలను శనివారం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి స్థానిక నాయకులతో కలసి పరిశీలించారు. భూముల ఆక్రమణతో పాటు విలువైన టేకుచెట్లు మాయం, అటవీ భూముల నుంచి అక్రమంగా తరలించుకుపోతున్న కంకర తవ్వకాలపై తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ పాతపట్నం మండలం ప్రహరాజపాలేం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 7లోని సుమారు రెండు ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్ భూమి, సర్వే నంబర్ 18లో ఉన్న కొత్త చెరువు గర్భాన్ని టీడీపీ నాయకులు ఆక్రమించుకుని ఇళ్ల స్థలాల ప్లాట్‌లు వేస్తుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భూముల ఆక్రమణతో పాటు టేకు చెట్లను, కంకరను స్థానిక ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే నాయకులు తరలించుకుపోతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి తప్పుడు సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు ఆక్రమణలపై స్పందించకపోతే సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అప్పటికీ అధికారుల్లో చలనం లేకుంటే జాతీయ కమిషన్‌కు సమస్యను తెలియజేస్తామన్నారు. ఆమెతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, సీనియర్ నాయకులు బి.నారాయణమూర్తి, పణుకు మోహన్, సత్య బిస్వాల్, టంకాల సుధాకర్, జీవ, వంశీ తదితరులు ఉన్నారు.



ప్రహరాజపాలేంలో అక్రమణకు గురైన కొత్త చెరువును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- తీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి: కలెక్టర్
- తొలిరోజు ఉత్సాహంగా బీచ్ ఫెస్టివల్



ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వర్‌రెడ్డి తదితరులు

సోంపేట:

బారువ సముద్ర తీరాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. బారువ సముద్ర తీరంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న బీచ్ ఫెస్టివల్‌లో భాగంగా శనివారం ఉదయం ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచే పెట్టే ప్రత్యేక కార్యక్రమాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక ఎమ్మెల్యే బి.అశోక్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల జీవిత చక్రం గురించి ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనను వీక్షించారు. బీచ్ వాలీబాల్ పోటీలు, పడవ పోటీలు ప్రారంభించారు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా తీరంలోని పరిసరాలు పరిశుభ్రం చేశారు.

కార్యక్రమంలో భాగంగా సోంపేట నటరాజ నాట్యకళామండలి చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బారువ తీరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అన్ని అవకాశాలు ఉన్నాయని కేంద్ర మంత్రి తెలిపారు. స్కూబా డైవింగ్, పారామోటార్ ఫ్లయింగ్, వాటర్ స్పోర్ట్స్ వంటి కార్యక్రమాలకు బారువ కేంద్రంగా మారుతుందన్నారు. వచ్చే నెల 3, 4న వివిధ పోటీలు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది రెండు లక్షల తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టడానికి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సముద్రంలోకి విడిచి పెట్టకుండా సేఫ్ డిస్పోజల్ చేయాలన్నారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మాట్లాడుతూ బారువ తీరాన్ని అభివృద్ధి చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. బీచ్ ప్లానింగ్ డైరెక్టర్ ప్రదీప్, స్కూబా ఇన్‌స్ట్రక్టర్ బలరాం, కెప్టెన్ సూర్య తదితరులు మాట్లాడుతూ అభివృద్ధి జరిగితే స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అటవీశాఖాధికారి వెంకటేశ్వరరావు, ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి, డీఎస్పీ వెంకటఅప్పారావు, ఆర్డీఓ వెంకటేష్, ట్రీ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ సుప్రజ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణశ్రీ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు దక్కని గౌరవం

సభా కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ యర్ర రజినీని పిలవకపోవడంపై గ్రామస్తులు చర్చించుకున్నారు. పంచాయతీ పరిధిలో జరిగే సమావేశానికి సర్పంచ్ కీలకం. సర్పంచ్ సభాస్థలి వద్ద ఉన్నా ఇటు అధికారులు గానీ, అటు ప్రజా ప్రతినిధులు గానీ సభావేదికపైకి సర్పంచ్‌ను పిలవలేదు.



ఈ వ్యర్థాల స్టాల్ కోసం కేంద్ర మంత్రికి వివరిస్తున్న పీసీబీ ఈఈ కరుణశ్రీ



గొంతు కోసి నడిరోడ్డుపై వదిలేసి

- వివాహిత దారుణహత్య
- పైడిభీమవరం నడిబొడ్డున ఘటన
- అనుమానితుడి ఆచూకీ కోసం పోలీసుల గాలింపు

పైడిభీమవరంలోని బోనం పేరంటాలు గుడి సమీప ప్రాంతం. సాయంత్రం 6 గంటల సమయం. అంతా రద్దీగా ఉంది. ఎవరి పనుల్లో వారు బిజీగా ఉన్నారు. అంతలో ఒకామె నడుచుకుంటూ వచ్చి పడిపోయింది. స్థానికులు గమనించి వెళ్లి చూసేలోపే తెగిన ఆమె గొంతు నుంచి రక్తం ధార కట్టి ఆ ప్రాంతమంతా ఎర్రగా మారిపోయింది. పైడి భీమవరం నడిబొడ్డున జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పాతికేళ్ల వివాహితను అత్యంత కర్కశంగా గొంతుకోసి చంపేశారు.





మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వివేకానంద (ఇన్‌సెట్లో) భవాని (ఫైల్)

రణస్థలం: మండలంలోని పైడి భీమవరం నడిబొడ్డున శనివారం సాయంత్రం జరిగిన వివాహిత దారుణ హత్య కలకలం రేపింది. స్థానికులు, జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. శనివారం సాయంత్రం బోనం పేరంటాలు గుడి వద్ద గుర్తు తెలియని వ్యక్తి అవాల భవాని(23) అనే వివాహితను దారుణంగా చాకుతో గొంతు కోసి వెళ్లిపోయాడు. సంఘటన స్థలంలోనే చాకును నీళ్లతో కడిగేసి అక్కడే పడేశాడు. కొన ఊపిరితో ఉన్న భవాని అక్కడకు కొద్ది దూరంలో వైఎస్సార్ విగ్రహం వెనుక బస్టాప్ దగ్గరలో చెరువు గట్టు వరకు వచ్చి అక్కడే పడిపోయి మృతి చెందింది. ఆమె భర్త వెంకట సత్యం లారీ డ్రైవర్‌గా పనికి వెళుతుంటాడు. ప్రస్తుతం ఒడిశా రాష్ట్రంలోని బరంపురం దగ్గరలో ఉన్నట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు.

భవానీ స్వగ్రామం విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలోని పెద్ద పతివాడ గ్రామం. నాలుగేళ్ల క్రితం పైడిభీమవరం పంచాయతీలోని గొల్లపేట గ్రామానికి చెందిన వెంకట సత్యంతో వివాహమైంది. ఈ దంపతులకు రెండున్నరేళ్ల కుమార్తె కూడా ఉంది. వెంకట సత్యం లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. భవాని పైడిభీమవరంలోని ఒక హోటల్ పని చేస్తోంది. శనివారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో హోటల్ నుంచి వెళ్లిపోయిందని యజమాని చెబుతున్నాడు. ఆ తర్వాత ఆమె సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో బస్టాప్ వద్ద విగతజీవిగా కనిపించింది. స్థానికులు సమాచారం అందించడంతో జేఆర్ పురం సీఐ అవతారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. 3.30 గంటల నుంచి ఆరు గంటల మధ్యలో ఆమె ఎటు వెళ్లిందనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. హోటల్‌లో పని చేసిన ఓ వ్యక్తిపైనే ప్రధానంగా అనుమానాలు ఉన్నాయి. అతడి ప్రమేయంపై విచారణ చేస్తున్నారు. మృతదేహాన్ని శవపంచనామా కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. దీనిపై జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవిని వివరణ కోరగా హత్య జరిగిందని నిర్ధారించారు.

క్లుప్తంగా

టెక్కలిలో జాబ్‌మేళా



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో నిర్వాహకులు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ, వేకెంట్ హైర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించినట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలిపారు. 72 మంది అభ్యర్థులు హాజరు కాగా 34 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. నియామక పత్రాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, జేకేసీ కో–ఆర్డినేటర్ బి.ఝాన్సీరాణి, హెచ్ఆర్ మేనేజర్ సీహెచ్.శ్రీధర్, శాంతనకుమార్, అధ్యాపకులు కసవయ్య, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్కూల్ గేమ్స్‌కు లావేరు విద్యార్థులు



జీవితకు సర్టిఫికెట్ అందిస్తున్న ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల: 68వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ బేస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు లావేరు ఉన్నత పాఠశాల క్రీడాకారులు పి.నాగలక్ష్మీ, సీలా సాయికుమార్ ఎంపికయ్యారు. ఈ నెల 22 నుంచి 27 వరకూ ఢిల్లీలో జరగనున్న 68వ జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ బేస్‌బాల్ పోటీల్లో వీరు ప్రాతినిధ్యం వహిస్తారు. వీరి ఎంపిక పట్ల ప్రధానోపాధ్యాయులు పసుపుల జగన్నాథరావు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కొందరు ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రయాణానికి ఆర్థిక సహాయం అందించారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అదే విధంగా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిల్లాస్‌పూర్‌లో జరిగిన 68వ జాతీయ జూనియర్ స్కూల్‌గేమ్స్ బేస్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని వచ్చిన 8వ తరగతి విద్యార్థిని అల్లాడ జీవితను అభినందించారు.

బీజేపీ నాయకుల ధర్నా



ఇందిరావిజ్ఞాన్‌భవన్ వద్ద ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో నిందితులుగా ఉన్న కాంగ్రెస్ ఎంపీలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలను తక్షణమే అరెస్టు చేయాలని భారతీయ జనతా పార్టీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు బూరె నరేంద్ర చక్రవర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అరసవల్లి కూడలిలోని ఇందిరా విజ్ఞాన్ భవన్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంపద నేషనల్ హెరాల్డ్ పత్రిక సంపదను దోచుకున్న నిందితులను అరెస్టు చేయాలని కోరారు. నిందితులపై ఈడీ కేసులు నమోదు చేస్తే ఇది బీజేపీ కుట్రపూరిత చర్య అని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతుండడం సిగ్గు చేటన్నారు. అనంతరం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తేజేశ్వరరావు, నాయకులు శవ్వాన ఉమామహేశ్వరి, పైడి వేణుగోపాలం, బిర్లంగి ఉమామహేశ్వరరావు, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జల రాజు వెంకట్, సింగుపురపు వెంటరమణ, నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు ధనుష్ రంగ, తరుణ్, ఉపాధ్యక్షులు మదన మోహన్, కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు సిబ్బంది

అరసవల్లి: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిబ్బంది శనివారం శాంతియుత నిరసన చేపట్టారు. డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట సంఘ జిల్లా అధ్యక్షురాలు ఉష ఆధ్వర్యంలో ఆరోగ్యమందిర్‌లో కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న 573 మంది ఈ నిరసనలో పాల్గొన్నారు. నియామకాలు జరిగి ఆరేళ్లు గడుస్తున్నా తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఇన్సెంటివ్‌తో పాటు ఏటా 5 శాతం ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగుల జీవితాల్లో.. ఉషస్సులు!



కృత్రిమ అవయవాలను అమర్చుతున్న దృశ్యం

- వైకల్యాన్ని జయించి దివ్యాంగుల సేవలో తరిస్తున్న ఉషారాణి
- ఇప్పటి వరకు 75 మందికి కృత్రిమ అవయవాలు
- భర్త సహకారంతో సేవా కార్యక్రమాలు

శ్రీకాకుళం కల్చరల్ : అంగ వైకల్యం మనిషిని ఎంతగా కుంగదీస్తుందో, ఆ బాధ ఎలా ఉంటుందో స్వయంగా అనుభవించిన ఆమె.. తనలాంటి వారి బాధలను కొంత అయినా తగ్గించాలని నిర్ణయించుకున్నారు. భర్త కష్టపడి సంపాదిస్తున్న సొమ్ములో కొంతమేర పొదుపు చేస్తూ ఆ మొత్తాన్ని దివ్యాంగుల సేవకు వినియోగిస్తున్నారు. సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొంటూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆ సేవకురాలే అరసవల్లికి చెందిన కల్లేపల్లి ఉషారాణి. భర్త జిల్లా పరిషత్‌లో చిరుద్యోగం చేస్తున్నారు. ఇద్దరు పిల్లలు. ఉషారాణికి చిన్నతనంలో పోలియో సోకడంతో కాలు పనిచేయక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైకల్యాన్ని పోగొట్టేందుకు తన తండ్రి అనేక ప్రయత్నాలు చేశారు. బరంపూర్‌లో రెండు ఆపరేషన్లు చేయించారు. కొంతవరకు నయమైనా పూర్తి స్థాయిలో అందరిలా నడవాలనే ప్రయత్నంలో కాలికి కేలిపైర్‌ను ఏర్పాటు చేసుకొని నడవడం ప్రారంభించారు.



గురుదేవ్ చారిటబుల్ ట్రస్టు వద్ద దివ్యాంగుడితో ఉషారాణి, నిర్వాహకులు

తనబాటలోనే పిల్లలు..

తన బాటలోనే తన పిల్లలు నడవాలని వారిని కూడా అందుకు సంబంధించిన కోర్సులలో చేర్పించి చదివిస్తున్నారు. ఉషారాణి కుమార్తె దుర్గప్రియ, కుమారుడు సాయి నిశ్చల్ ఫిజియోథెరపీ కోర్సులలో చేర్పించారు. వారిని అందులో నిష్ణాతులను చేసి దివ్యాంగుల సేవ కోసం ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయంలో భర్త కూడా ఎంతగానో సహకారం అందిస్తున్నారు.

భర్త సహకారంతో..

తనలా ఇంకెవరూ ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో దివ్యాంగులకు తన వంతు సేవ చేయాలని ఉషారాణి నిర్ణయించుకున్నారు. భర్త శ్రీరామమూర్తి సహకారంతో తమకు వచ్చిన సంపాదన లోంచి కొంత సొమ్మును పొదుపు చేసుకుంటూ ఉషారాణి చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి కాలు, చెయ్యి, కళ్లు లేనివారికి సాయం చేస్తున్నారు. ఇలా ఇప్పటివరకు రూ.3 లక్షలకు పైగా ఖర్చు చేశారు. ఎవరికైనా కృత్రిమ అవయవాలు ఏర్పాటు చేయాలంటే విజయనగరం జిల్లాలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టును ఆశ్రయించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉషారాణి తన బృందంతో కలిసి జిల్లాలోని మారుమూల గ్రామాల్లో పర్యటించి అవయవాలు అవసరమైన వారిని గుర్తిస్తున్నారు. వారిని సొంత ఖర్చుతో ట్రస్టు వద్దకు తీసుకెళ్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండి అవయవాలు చేయిస్తున్నారు. ఇందుకయ్యే ఖర్చునంతా తానే భరిస్తున్నారు. ఇటీవల ఉషారాణి చారిటబుల్ ట్రస్ట్, లైన్స్‌క్లబ్ హర్షవల్లి సహకారంతో కృత్రిమ అవయవాల మంజూరుకు క్యాంపు ఏర్పాటు చేశారు. ఒకేసారి 50 మందికి కృత్రిమ అవయవాలను అందించారు.

వారి సంతోషమే మా ఆనందం



దివ్యాంగుల కళ్లలో నుంచి వచ్చే సంతోషమే మాకు ఆనందం. దీనంతటికీ కారణం మా నాన్నే. ఆయన కూడా దివ్యాంగుల కోసమే కాకుండా అనాథలకు ఎంతగానో సాయం అందించేవారు. మా సంపాదనలో వచ్చే పది రూపాయలలో రూ.4 పొదుపు చేస్తూ ఈ సేవ చేస్తున్నాను.

– కల్లేపల్లి ఉషారాణి, అరసవల్లి

ఉపాధి వేతనాలు తక్షణమే చెల్లించాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర తూర్పుకాపు కుల విభాగం అధ్యక్షుడు శ్రీకాంత్

పాతపట్నం: ఉపాధి హామీ పథకం వేతనదారులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర తూర్పుకాపు కుల విభాగం అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. పాతపట్నంలోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనవరి నుంచి ఇప్పటి వరకు కోట్ల రూపాయల్లో వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. పని ప్రదేశంలో కూలీలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. మండుటెండలో కూలీలు శ్రమిస్తున్నా కనీసం నీటిని కూడా సరఫరా చేయకపోవడం దారుణమన్నారు. టెంట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. వేతనాలు అందక అనేక కుటుంబాలు సుదూర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితి దాపురించిందన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో సరైన సమయంలో ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో గణపతి ప్రధాన్, పాడి అప్పారావు, పడాల రంజీత్, ఎన్ని తిరుపతి, శ్రీనివాసరావు, డిల్లేశ్వరరావు, నాగరాజు, మద్ది నారాయణ రెడ్డి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాలకుల తీరుతో సర్కారు బడులకు ముప్పు



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి

గార: ప్రైవేటు పాఠశాలలను ప్రోత్సహించేలా ప్రభుత్వ ఆలోచనలున్నాయని, బాలికా విద్యకు ప్రోత్సాహమంటూనే ప్రాథమికోన్నత పాఠశాలలు మూసివేసేందుకు అడుగులు పడుతున్నాయని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి అన్నారు. శనివారం బలరాంపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని చక్కదిద్దుతున్నామని ఓవైపు ప్రకటనలు చేస్తూ, ప్రతీ శుక్రవారం మీ అభ్యంతరాలను వినేందుకు మా అధికారులు మీ కోసం ఎదురుచూస్తున్నారని పైకి తీయని మాటలు చెబుతూనే లోలోపల పాఠశాలలను కుదించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 1256 యూపీ స్కూళ్లను ప్రైమరీగా డీగ్రేడ్ చేస్తున్నట్టు శుక్రవారం ప్రకటించారని, ఆయా పాఠశాలల్లో విద్యార్థుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వీరంతా సమీప పాఠశాలలో చేరుతారని ఎలా చెప్పగలుగుతున్నారని, వాంతా ప్రైవేట్ బాటపట్టడానికి ప్రభుత్వమే అవకాశం కల్పించినట్లు ఉందని చెప్పారు. బాలికల డ్రాపౌట్లు తగ్గించేందుకు యూపీలు ప్రవేశపెట్టారని, మరి ఇప్పుడు బాలికల విద్యకు ప్రాధాన్యం లేదా అని ప్రశ్నించారు. పాఠశాలలను తగ్గించడం, పోస్టులను మిగిల్చడం తప్ప నిజంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పాలకులకు చిత్తశుద్ధి లేదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని స్పష్టం చేశారు. హైస్కూల్‌తో సంబంధం లేకుండా వేరుగా మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఉండేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో హెచ్‌ఎం కె.అశోక్‌కుమార్, రామకృష్ణ, నీలవేణి, విశ్వనాథం, యామిని, ప్రియదర్శిని, అలుగోలు సత్యనారాయణ పాల్గొన్నారు.

తిలారు పాఠశాలలో చోరీ



పాఠశాలను పరిశీలిస్తున్న పోలీసులు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం తిలారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోరీ జరిగినట్లు ప్రధానోపాధ్యాయుడు టి.లక్ష్మణరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 17వ తేదీ రాత్రి పాఠశాలలో దుండగులు చొరబడి 6వ తరగతి గది తాళాలు బద్దలుకొట్టి డెస్క్‌టాప్, కీబోర్డు, ప్రొజెక్టర్ వంటి సుమారు రూ.2లక్షలు విలువైన సామగ్రి పట్టుకుపోయారని పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాల సెలవు రోజుకావడంతో శనివారం వచ్చి చూసే సరికి చోరీ జరిగినట్లు గుర్తించామని తెలిపారు. కోటబొమ్మాళి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



స్వాధీనం చేసుకున్న సామగ్రితో ఎక్సైజ్ సిబ్బంది

మందస: మండల పరిధిలోని గిరిజన గ్రామాల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా చుక్కాంబో, సవర రాజపురం బుడంబో గ్రామాల్లో శనివారం తనిఖీ చేయగా సుమారు 1000 లీటర్ల బెల్లం ఊట, 40 లీటర్ల సారా ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.బేబి తెలిపారు.

న్యూసెన్స్ కేసులో వ్యక్తికి జైలుశిక్ష

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని వాంబేకాలనీలో శనివారం ఓ వ్యక్తి మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. దమ్మలవీధికి చెందిన కొమర అప్పన్న వాంబేకాలనీ వద్ద బహిరంగంగా మద్యం తాగి స్థానికులకు ఇబ్బంది కలిగించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అరెస్టు చేసి న్యాయస్థానంలో రెండో తరగతి మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా నెల రోజులు జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

రన్ ఫర్ జీసస్



క్రీస్తు పునరుత్థానమును పురస్కరించుకుని శ్రీకాకుళంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

టీచర్ అదృశ్యం

పొందూరు: స్థానిక గాంధీనగర్ వీధికి చెందిన బుగత రమణ కనిపించడం లేదంటూ ఆయన భార్య సంతోషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పొందూరు ఎస్ఐ వి.సత్యనారాయణ శనివారం కేసు నమోదు చేశారు. విజయనగరం జిల్లా ఏఆర్ వలస మండలం లక్ష్మీపురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రమణ శుక్రవారం సాయంత్రం 7.30 గంటల సమయంలో బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో భార్య పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ మైదానంలో గంజాయి ఒప్పందాలు

- ఇద్దరు ఒడిశా యువకులను అరెస్టు చేసిన కాశీబుగ్గ పోలీసులు
- 10 కేజీల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ



పట్టుబడిన ఒడిశా యువకులతో పోలీసులు

కాశీబుగ్గ: క్రికెట్ గ్రౌండ్‌లో ఆ యువకులకు పరిచయం ఏర్పడింది. ఓవైపు ఆడుతూనే.. మరో వైపు అక్రమంగా డబ్బులు ఎలా సంపాదించాలో ఆలోచించారు. ఈ క్రమంలో గంజాయి అక్రమ రవాణా చేయాలని నిర్ణయించుకున్నారు. చివరకు పోలీసులకు దొరికిపోయి కటకటాలపాలయ్యారు. కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు, సీఐ సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా తండిగుడ, తాళ్లబంద గ్రామాలకు చెందిన తపాన్ బెబారత, మానసిత్ సింగ్ ఇరుగు పొరుగు గ్రామాల యువకులు. తరచూ క్రికెట్ గ్రౌండ్‌లో కలుసుకునేవారు. పది కేజీల గంజాయిని హైదరాబాద్‌కు తరలిస్తే రూ.10 వేలు వస్తుందని ఒప్పందం కుదరడంతో ఇద్దరూ పలాసలోని రైలు నిలయానికి వచ్చారు. బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద 10.39 కేజీల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మూడు వాహనాలు ఢీ

- ముగ్గురికి గాయాలు
- దన్నానపేట హైవేపై ఘటన



ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ



బోల్తా పడిన ట్రాక్టర్

రణస్థలం : మండల కేంద్రంలోని జె.ఆర్.పురం పంచాయతీ దన్నానపేట వద్ద జాతీయ రహదారిపై శనివారం మూడు వాహనాలు ఢీకొట్టుకున్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు, జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం 8.50 గంటల సమయంలో విశాఖపట్నం వైపు నుంచి వస్తున్న లారీ ముందు వెళుతున్న ధాన్యం నూర్పిడి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఆ వాహనం ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ రెడ్డి శ్రీనుకు స్వల్ప గాయాలు కావడంతో రణస్థలం సీహెచ్‌సీలో చేర్పించారు. ట్రాక్టర్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులు యు.రామకృష్ణ, యు.విజయగౌరీలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్సులో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలాన్ని జె.ఆర్.పురం పోలీసులు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎస్.చిరంజీవి చెప్పారు.

విద్వేషాలు రెచ్చగొట్టడం తగదు

శ్రీకాకుళం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా పాలన సాగిస్తోందని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు ధ్వజమెత్తారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో మతాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని దుయ్యబట్టారు. దీనిని ఎదురిస్తున్న కాంగ్రెస్ నాయకులను మట్టు పెట్టాలని చూస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆస్తులు మీద, పార్టీ కార్యాలయాల ఎదుట నిరసనలు చేయడం విడ్డూరమన్నారు. ఇలాంటి చర్యలకు భయపడేది లేదన్నారు. బీజేపీ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు.

పంట పొలాల్లో.. దౌర్జన్యంగా విద్యుత్ స్తంభాలు

- రైతులకు సమాచారం ఇవ్వని రొయ్యిల వ్యాపారి
- కలెక్టర్, విద్యుత్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన బాధితులు



వ్యవసాయ పొలాల్లో వేసిన విద్యుత్ స్తంభాలు, హై టెన్షన్ లైన్

సంతబొమ్మాళి: రొయ్యిల వ్యాపారి తమకు కనీసం సమాచారం ఇవ్వకుండా, దౌర్జన్యంగా పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు వేశారంటూ రైతులు ఆందోళన చేపట్టారు. ఇదేంటని ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నాడని వాపోయారు. వివరాల్లోకి వెళితే.. సంతబొమ్మాళి మండలం సెగిడి లక్కివలసకు చెందిన శంకరమహేష్ అనే వ్యాపారి టెక్కలి మండలం నాయుడుపేటలో ఇటీవల రొయ్యిల చెరువులను కొనుగోలు చేశారు. వాటికి విద్యుత్ కనెక్షన్ కోసం వ్యవసాయ పొలాల్లో విద్యుత్ స్తంభాలను కొంతవరకు దౌర్జన్యంగా వేశారు. ఈ విషయం తెలియడంతో నౌపడ, సీతానగరం గ్రామాలకు చెందిన పలువురు రైతులు సదరు వ్యాపారిని ప్రశ్నించారు. తమకు చెప్పకుండా వ్యవసాయ పొలాల్లో ఎలా విద్యుత్ స్తంభాలు వేశారని రైతులు విశ్వగురు శర్మ, వాడరేవు గణపతి, కూర్మనాయకులు, బి.అప్పారావు, చిన్నబాబు తదితరులు నిలదీశారు. దీనిపై సదరు వ్యాపారి స్పందిస్తూ పొలాల్లో వేసిన స్తంభాలు తీసివేసి ప్రభుత్వ భూమి మీదుగా స్తంభాలు వేయిస్తానని నమ్మబలికాడు. ఆ వ్యాపారి మాటలు నమ్మి రైతులు వెనుతిరిగారు. ఇప్పుడు రైతుల స్తంభాలు తీయకపోగా రాత్రి వేళ విద్యుత్ శాఖ సిబ్బందితో పని చేయించి హైటెన్షన్ విద్యుత్ వైర్లతో కనెక్షన్‌ను రొయ్యిల చెరువుకు ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఇదేంటని సదరు వ్యాపారిని ప్రశ్నించగా 'మీకు ఇష్టం వచ్చినట్లు చేసుకోండి నాకు ఏమీ కాదు' అంటూ సదరు వ్యాపారి బెదిరిస్తూ మాట్లాడారు. మా పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు వేసి హై టెన్షన్ వైర్లకు ఉప్పు గాలులతో ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని రైతులు నిలదీశారు. ఈ సమయంలో సదరు వ్యాపారి దురుసుగా ప్రవర్తించాడని రైతులు ఆరోపించారు. దీంతో శనివారం జిల్లా కలెక్టర్‌కు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా రైతులు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం జరగకపోతే కోర్టులో పోరాడతామని చెబుతున్నారు. కాగా, వ్యాపారి చెప్పిన వెంటనే పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు వేయడంలో విద్యుత్ శాఖ అధికారుల ఉత్సాహం ఏంటో అర్థం కావడం లేదని , రైతులకు సదరు వ్యాపారి సమాచారం ఇచ్చారా లేదా అన్నది తెలుసుకోవాల్సిన బాధ్యత అధికారులకు లేదా అని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు.

బెదిరిస్తున్నారు..



మా పంట పొలాల్లో దౌర్జన్యంగా విద్యుత్ స్తంభాలు వేసి హైటెన్షన్ వైర్లతో కనెక్షన్ కూడా ఇచ్చారు. ఇదేంటని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి. – వాడరేవు గణపతి, రైతు, సీతానగరం

సరఫరా ఆపాం..

రొయ్యిల చెరువుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చినప్పటికీ తర్వాత రైతుల నుంచి అభ్యంతరాలు రావడంతో సప్లయ్ ఆపాం. తహసీల్దార్ నుంచి అనుమతి తీసుకున్న తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సరఫరా చేస్తాం.

– ఎం.శివకుమార్, విద్యుత్ శాఖ ఏఈ, సంతబొమ్మాళి